ఆదివారం
ప్రజాశక్తి
మే 4, 2003

వెర్రితలలేస్తున్న కాలేజ్ 'ఫెస్ట్'లు

హ్యాపీ బర్త్‌డే

(4-5-2003 నుండి 10-5-20030)



నంద్యాల హాని
మే-5
షెహత-రాజశేఖర్‌రెడ్డి
పద్మావతి నగర్- నల్లగొండ

సాయితరుణ్(బద్రి)
3॥సం, మే-2000
సుజాత- సత్యం
పాలకుర్తి -వరంగల్

మువ్వా సాయిరామ్
5॥సం, 5. 5. 1998
యోగేశ్వరి- శ్రీనివాసరావు
కాకానిపాలెం- ప్రకాశం

ఎమ్‌డి. సైఫ్ అల్మఫీ
2॥సం, 5. 5. 2001
రుబీనా సుల్తానా- ఎమ్‌డి సాధిఅల్మఫీ
మహబూబ్‌నగర్



ముజాయిద్
2॥సం,5. 5. 2001
సఫిమబేగం-ఖాదర్
అమరచింత-మహబూబ్‌నగర్

ఎస్.మణిశర్మ
4॥సం, 6. 5. 1999
సరిత-తిరుమలేష్
అమరచింత-మహబూబ్‌నగర్

ఐ.ప్రవల్లిక
6సం॥,8.5.1997
కృపామణి-రాజబాబు
కొండపల్లి-కృష్ణ

ఎస్.శరణ్య
9॥సం, 8.5. 1994
పద్మావతి-వెంకటేష్
అమరచింత- మహబూబ్‌నగర్

జి. శివాని
3॥సం,10.5. 2000
స్వరూప-ప్రకాష్
గురజాల- ఆదిలాబాద్

ఎస్‌కె.ఆదిల్
మే-10
జీనత్-షబ్బీర్
ఎన్.వి.గార్డెన్-నెల్లూరు



అవసరమవుతుంది.

2. అండాన్ని బయటకు తీయటం :

ఇది ఒక సున్నితమైన ప్రత్యేకమైన పద్ధతి. ఆపరేషన్ గదిలో మత్తు ఇచ్చి స్కానింగ్ సహాయంతో యోని ద్వారా సన్నటి సూది ద్వారా జాగ్రత్తగా అండాలను బయటకు తీయాలి. దీన్ని ఒక టెస్ట్ ట్యూబ్‌లో ఉంచుతారు.

ఈ ప్రక్రియ వల్ల అప్పుడప్పుడు కొద్దిగా పొత్తి కడుపునొప్పి, స్వల్పంగా రక్తస్రావం జరగవచ్చు.

3. ఇంద్రియ కణాలు అండంతో సంపర్కం :

పై విధంగా పొందిన అండాల్ని ప్రత్యేకమైన కల్చర్ మీడియాలో పొందుపరచి 4-6 గంటల వరకు కార్బన్ డయాక్సైడ్ ఉన్న వాతావరణం కలిగిన ఇన్‌క్యు బేటర్‌లో ఉంచుతారు.

భర్త ఇంద్రియకణాలను ఒక క్రమమైన పద్ధతి ద్వారా శుభ్రం చేసి అండములలోకి సంపర్కం కొరకు ఉంచుతారు. కొద్దిసేపట్లో ఈ సంపర్కం ద్వారా పిండం ఏర్పడుతుంది.

4. పిండం గర్భాశయంలోకి అమరిక :

పిండం ఏర్పడిన 24-72 గంటలలో 'టెఫ్లాన్' ట్యూబ్ ద్వారా యోని నుండి గర్భాశయంలోకి అమర్చడం జరుగుతుంది. ఈ మార్పిడి జరిగిన సుమారు రెండు రోజుల వరకు తల్లికి పడకపై పూర్తి విశ్రాంతి చాలా అవసరం.

ఏ) గర్భనిర్ధారణ : ఈ ప్రక్రియ అయితే 2-3 వారాలకు రక్త/మూత్ర పరీక్ష ద్వారా గర్భం ఏర్పడినట్లు నిర్ధారణ అవుతుంది. ఈ విధంగా ఏర్పడిన గర్భం నిలపటానికి 'ప్రొజెస్టిరాన్' అనే హార్మోన్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

బీటా హెచ్.సి.జి. అనే రక్త పరీక్ష పిండం ఏర్పడిన 2-3 వారాల తర్వాత గర్భధారణను నిర్ధారిస్తుంది. కాని ఈ పరీక్ష ప్రస్తుతం చెన్నై వంటి నగరాలలో మాత్రమే లభ్యమవుతున్నది.

స్కానింగ్‌ద్వారా ఈ దశలో గర్భాశయంలో గర్భం ఏర్పడిన ప్రదేశాన్ని ముఖ్యంగా గమనించగలం. ఈ స్కానింగ్ సుమారు 30-35 రోజుల తర్వాత చేయడం పరిపాటి.

రక్త పరీక్షలో తెలిసిన తర్వాత, స్కానింగ్ ద్వారా పిండం ఏర్పడిన సంచి కనబడటం, ఆ తర్వాత స్కానింగ్‌లో సుమారు 8 వారాలకు పిండంలో గుండె కొట్టుకోవడం కన్పించడం ద్వారా పూర్తిగా గర్భనిర్ధారణ అవుతుంది.

బి) సంతాన సాఫల్యం - ఫలితాలు : పై విధంగా సంతాన సాఫల్యం అనేది అన్ని జాగ్రత్తలు తీసుకున్నా అది 25-30 శాతం మాత్రమే! చేసే ఆస్పత్రి వాతావరణం, చేసే వారి నిపుణత తీసుకునే జాగ్రత్తలకు అనుగుణంగా ఫలితాలు ఎక్కువ, తక్కువలుగా ఉండొచ్చు.

సి) ఇక్సీ : ఇటువంటి కృత్రిమ పద్ధతులలో సరికొత్త మలుపు 'ఇక్సీ' ప్రక్రియ. ఇది అత్యాధునిక, అతి సున్నితమైన ప్రక్రియ. భర్త ఇంద్రియ కణాలు అతి తక్కువగా ఉన్నప్పుడు కూడా ఈ ప్రక్రియ వల్ల సంతాన సాఫల్యం కలిగే అవకాశం ఉంది. దీనిలో అతి సున్నితమైన పరికరాల ద్వారా, ప్రత్యేకమైన 'ఇన్వర్టెడ్' మైక్రోస్కోప్ ద్వారా ఇంద్రియ కణాన్ని అండంలోకి చొప్పించడం జరుగుతుంది. ఈ విధమైన సంపర్కం ద్వారా ఏర్పడిన పిండం గర్భకోశంలో పెరుగుతూ మామూలు గర్భంగా అభివృద్ధి అవుతుంది.

ఐ.వి.ఎఫ్. (ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్) కంటే ఇక్సీ (ఇంట్రా సైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజక్షన్) ప్రక్రియ ద్వారా గర్భం దాల్చే అవకాశం మరో 10 శాతం ఎక్కువ ఉండవచ్చు.

డి) సంతాన సాఫల్యం - సమస్యలు : కాని ఇదిపైన చెప్పినంత సులువు మాత్రం కాదు. సాధారణంగా గర్భం రావటానికి ఛాన్స్ 25 శాతం మాత్రమే. అనగా 100 మంది భార్యాభర్తలను పరీక్ష చేసి ఇద్దరిలో ఏ లోపం లేదని తెలుసుకొన్న తరువాత మామూలుగా సంభోగించినా కూడా ఒక నెలలో 25 శాతానికి మాత్రమే గర్భం వస్తుంది. మిగతా 75 శాతానికి గర్భం రావటానికి ఒకటి లేక రెండు సంవత్సరాలు పట్టవచ్చు. ఈ 25శాతం ఛాన్స్‌ని అధిగమించటం ఏ ఐ.వి.ఎఫ్. వంటి ప్రక్రియ వల్ల కూడా ప్రస్తుతం సాధ్యపడటం లేదు.

ఇందులో ఒక సున్నితమైన విషయం ఏమిటంటే, గర్భధారణ జరిగిన ప్రతి స్త్రీ అన్ని పరీక్షలలో ఉత్తీర్ణత కనబరచి గర్భం చివరిదశ వరకూ సాగుతుందని ఎటువంటి గ్యారంటీ ఉండదు. అసలు గర్భధారణయే జరగకపోవడం మాట అటుంచి, ఏ దశలోనైనా గర్భస్రావం జరగడం, రెండు/మూడు పిండాలు (మల్టిపుల్ ప్రెగ్నెన్సీ) ఏర్పడటం, పిండం 4-5 వారాలలో లేదా ఆ తర్వాతనో లోలోన నశించి ఒక గడ్డలా మారిపోవటం, వగైరాలు సాధారణ; గర్భిణీలలో వలెనే ఈ ఐ.వి.ఎఫ్./ఇక్సీ ప్రక్రియలలో కూడా కూడుకుని ఉన్న సమస్యలు. కాని సాధారణ గర్భిణీలలో ఇంత ముందరగా, ఇంత విస్తృతంగా వివిధ పరీక్షలు జరపకపోవడం వల్ల ఈ సమస్యలు అంతగా గమనించటం జరగదు.

ఇ) సంతాన సాఫల్యం - ఖర్చు : ఇక ఈ ప్రక్రియలకు అయ్యే ఖర్చు ప్రదేశాన్ని బట్టి, ఆస్పత్రిని బట్టి, చేసే డాక్టర్ల నైపుణ్యాన్ని బట్టి భిన్నంగా ఉంటాయి. ముఖ్యంగా ఈ ఖర్చు ఒక 'సైకిల్'కి చెప్పగలం. కాని ఎన్ని నెలసరులు చేయించుకుంటే గర్భం వస్తుంది అనేది ఎవ్వరూ చెప్పలేరు. ఈ ఖర్చు విషయంలో సాధారణంగా గర్భం రాని వారు మళ్ళీ మళ్ళీ ఇటువంటి ప్రక్రియలు చేయించుకునే సమయంలో ఎంతో నిరాశకు గురవటం గమనిస్తుంటాము! కొన్ని పట్టణాలలో, కొన్ని ఆస్పత్రులలో విచారించి ఒక సగటు ఖర్చు చెప్పగలం !

ప్రతి సైకిల్‌కు అయ్యే ఖర్చు (సుమారు రూపాయలలో)

ప్రక్రియల ముందు ఇచ్చే హార్మోనులు,
ఇంజెక్షన్‌లు వగైరా రూ. 20,000నుంచి 50,000

ఐ.వి.యఫ్. ప్రక్రియకు వాడే
డిస్పోజబుల్స్ వగైరా రూ. 20,000 నుంచి 25,000

ఇక్సీ ప్రక్రియకు
ప్రత్యేకంగా రూ. 30,000 నుంచి 35,000

ఇవికాక ఆస్పత్రిలో ఉన్నందుకు, మందులు, ఇతర ఖర్చులు అదనం. ◆

* అంపశయ్య నవీన్

వరుసగా పదిహేను రోజులూ ఆదివారాలే !

మూడు రోజుల్నుంచి పోస్టాఫీసుల్ని ఏవేవో సెలవులని మూసేశారు. ఈ రోజన్నా తెరవకపోతారా అన్న ఆశతో పోస్టాఫీసుకు వెళ్ళాను. ఆ రోజు కూడా అంటే ఏప్రిల్ 15 నాడు కూడా పోస్టాఫీసు మూసేసే ఉండటం చూసి షాకై పోయాను. అర్జెంట్‌గా ఓ పుస్తకాన్ని ఢిల్లీలో ఉన్న ఓ మిత్రుడికి పంపించడం కోసం నేను పోస్టాఫీసుకొచ్చాను.

"ఈ రోజు కూడా పోస్టాఫీసునెందుకు మూసేశారు?" అని అడిగితే "ఈ రోజు మహావీర్ జయంతట సార్! అందుకని పోస్టాఫీసుల్ని క్లోజ్ చేశారు" అని అక్కడున్న నాలాంటి ఓ కస్టమర్ చెప్పారు.

"మిగతా గవర్నమెంట్ ఆఫీసులన్నీ తీసే ఉన్నాయే!! అన్నాను.

'మహావీర్ జయంతి సెంట్రల్ గవర్నమెంట్ హాలిడే అట సార్. స్టేట్ గవర్నమెంట్ ఆఫీసులు తీసే ఉంచినట్టున్నారు" అన్నాడాయన.

"నిన్న అంబేద్కర్ జయంతి కాబట్టి సెలవు. మొన్న ఆదివారం కాబట్టి సెలవు. అంతకుముందు రోజు సెకండ్ సాటర్‌డే కాబట్టి స్టేట్ గవర్నమెంట్ ఆఫీసులకు సెలవు. ఇంకా అంతకు ముందు శ్రీరామనవమి కాబట్టి సెలవు. వరుసగా ఐదు రోజులు సెలవులే అయితే ప్రభుత్వాఫీసుల్లో అర్జెంట్ పనులున్న వారి గతి ఏం కావాలి?"

ప్రజలేమైపోతున్నారన్నది ప్రభుత్వాలకేం పట్టింది. ఈ వారంలో రేపు, ఎల్లుండి - రెండ్రోజులే వర్కింగ్‌డేస్ సార్... మళ్ళీ శుక్రవారం అంటే 18 నాడు కూడా సెలవే"

'ఎందుకు?'

"ఆ రోజు గుడ్‌ఫ్రైడే అట సార్"

"ప్రభుత్వోద్యోగులకు పండగసార్... ఈ ఏప్రిల్ నెలంతా సెలవులే సెలవులు... రెండ్రోజుల్లో, మూడురోజులో కాజువల్ లీవ్ పెట్టి ఓ పది రోజులు హాయిగా ఇంట్లో ఉండటమో, ఏ విహార యాత్రకైనా వెళ్లడమో చెయ్యొచ్చు."

"మన దేశంలో ప్రభుత్వాఫీసులకు, స్కూళ్ళకూ, కాలేజీలకూ ఉన్నన్ని సెలవులు ప్రపంచంలో ఏ దేశంలో కూడా లేవుట. కొందరు కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ఆల్‌రెడీ వారానికి రెండు రోజులు సెలవులు. వాళ్ళు పని చేసేది వారానికి ఐదు రోజులే కదా... అలాంటప్పుడు మహావీర్ జయంతులకూ, గుడ్‌ఫ్రైడేలకు సెలవులివ్వకపోతే ఏం... 1963లో అమెరికా ప్రెసిడెంట్ కెన్నడీని హత్య చేసినప్పుడు ప్రపంచమంతా ఆ వార్త విని దిగ్భ్రాంతి చెందింది. అమెరికన్లు కూడా ఆ వార్తతో చలించిపోయారు. కానీ ప్రెసిడెంట్ కెన్నెడీ అంతటివాడు హత్య చేయబడినప్పుడు కూడా అమెరికా ప్రభుత్వం ఒక్క రోజు కూడా సెలవు ప్రకటించలేదు. అలాగే 1953లో అప్పటి సోవియెట్ యూనియన్‌లో ఆ దేశాన్ని మూడు దశాబ్దాలు పాలించిన ఆ దేశ ప్రధాని, ఉక్కు మనిషిగా పేరుగాంచిన స్టాలిన్ చనిపోయారు. స్టాలిన్ చనిపోయిన విషయాన్ని అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పార్లమెంట్‌లో ప్రకటించి ఆ రోజు పార్లమెంట్ కార్యక్రమాల్ని ముగించినట్టు ప్రకటించారు. అంతేకాకుండా ఆ రోజు భారత దేశానికంతటికీ సెలవు ప్రకటించాడు. ఆ తర్వాత తెలిసిందేమిటంటే స్టాలిన్ అంతటి మహానాయకుడు చనిపోతే కూడా సోవియట్ యూనియన్‌లో సెలవు ప్రకటించలేదని. స్టాలిన్ చనిపోయినప్పుడు సోవియట్ యూనియన్ ప్రభుత్వం ఒక్క రోజు కూడా సెలవు ప్రకటించలేదని తెలిసినప్పుడు మన నెహ్రూగారు చాలా ఆశ్చర్యపడ్డారట.. ఇది మన దేశానికీ, ఇతర దేశాలకూ మధ్య ఉన్న వ్యత్యాసం... ప్రభుత్వాఫీసుల్లోనూ, ప్రభుత్వరంగ సంస్థల్లోనూ పనులు జరగడం లేదనీ, అరగంటలో జరగాల్సిన పనికి ఆరు నెలలు పడుతుందనీ, లంచం ఇస్తే తప్ప ప్రభుత్వాఫీసుల్లో పనులు జరగవనీ, అంకితభావంతోనూ, సేవాభావంతోనూ పని చేసే ప్రభుత్వోద్యోగులు చాలా తక్కువగా కనిపిస్తారనీ మనం తరచూ వింటుంటాం. ఇన్ని సెలవులున్నాక ఎవరికైనా ఎందుకు పని చెయ్యాలనిపిస్తుంది. ప్రభుత్వోద్యోగులు సంవత్సరానికి ఓ వంద రోజులు పని చేస్తే చాలు. ఎందుకంటే ప్రతి పండక్కి ప్రతి జాతీయనాయకుడి పుట్టిన రోజునాడో, గిట్టిన రోజునాడో సెలవులెట్టాగూ ఇస్తారు. అకస్మాత్తుగా ఏ మాజీ మంత్రిగారో, ఏ మాజీ అధ్యక్షుడో చనిపోతే ఆ రోజు సెలవే. ఇలాంటి సెలవులు పోగా ప్రతి ప్రభుత్వోద్యోగీ సంవత్సరానికి పదిహేను రోజులు ఆకస్మిక సెలవులు (క్యాజువల్ లీవ్స్) పెట్టుకోవచ్చు. ముప్పై రోజులు ప్రివిలేజ్ లీవ్స్ ఉంటాయి. ఇంకో ముప్పై రోజులు జబ్బుపడినట్లుగా డాక్టర్ దగ్గర నుండి ఓ సర్టిఫికెట్ తీసుకొని మెడికల్ లీవ్ తీసుకోవచ్చు.

ఇన్ని సెలవులు పోగా మన ప్రభుత్వోద్యోగులు సంవత్సరంలో ఓ వంద రోజులు కూడా గట్టిగా పని చెయ్యాల్సిన అవసరం లేదు. జీతం మాత్రం 365 రోజులకూ లభిస్తుంది. ప్రభుత్వ సంస్థల మీద ప్రజలకు నమ్మకం పోతున్నదంటే పోకేం చేస్తోంది? ఇవ్వాళ్ళ ప్రభుత్వ సంస్థలనన్నింటినీ ప్రైవేట్ పరం చేస్తున్నారు. ప్రజలు ప్రైవేట్ సంస్థల్నే ఎక్కువగా నమ్మేలా చేస్తోంది ప్రభుత్వం. నేను పుస్తకాలు పంపించడానికి పోస్టాఫీసుకు వెళ్తున్నానని చెబితే మా మిత్రుడొకాయనేమన్నాడో తెలుసా? "నువ్వింకా పోస్టాఫీసుల్నే నమ్ముతున్నావా? ఇవ్వాళ్ల పోస్టు చేస్తే నీ లెటర్ అవతలివాడికి ఎన్ని రోజులకందుతుందో చెప్పలేం. అదే ప్రైవేట్ వాళ్లు నడుపుతున్న కొరియర్ సర్వీసుల్ని చూడు. నువ్వివ్వాళ్ళ బుక్ చేసిన లెటర్ రేపు డెలివరీ అవుతుంది."

"కొరియర్ సర్వీసు వాడు డబ్బెక్కువ తీసుకుంటాడు అంటే నమ్మకంగా వేగంగా అందుతుందనుకున్నప్పుడు నాలుగు డబ్బులు పోతే మాత్రం ఏమిటి" అన్నాడా మిత్రుడు.

"కొన్ని రోజులు పోతే అంతా ప్రైవేట్ పరమే అయిపోయే రోజులొచ్చాయి. అప్పుడు ప్రజల పాట్లు చెప్పనవసరం లేదు. ప్రయివేట్ వాళ్ళు ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇట్లా అడ్డగోలుగా సెలవులిచ్చి ప్రభుత్వమే ప్రభుత్వ రంగ సంస్థల్ని భ్రష్టుపట్టించే కుట్ర చేస్తోంది" అన్నాను. ◆

...లిన ముక్క ఏది?



ఎంత మంది మిత్రులు?

నసీరుద్దీన్ ఒకప్పుడు భూస్వామిలా బతికాడు. అప్పుడు ఆయనకు చాలా మంది మిత్రులు వుండేవారు. ఆయన ఎక్కడికెళ్లినా ఆ మిత్రబృందమంతా తరలి వస్తుండేది. అది చూసినవాళ్లంతా 'అబ్బో! నసీరుద్దీన్‌కి ఇంతమంది స్నేహితులా?' అని ఆశ్చర్యపోయేవారు. నసీరుద్దీన్ పొరుగున వుండే వ్యక్తికి ఇది మరీ వింతగా తోచేది. 'ఏంటి? నసీరుద్దీన్ చుట్టూ ఎప్పుడూ ఇంత మంది మిత్రులుంటారు.ఇదేదో తేల్చుకోవాల్సిందే' అనుకున్నాడు. వెంటనే ఇంటికెళ్లి తన అనుమానాన్ని ఆయన ముందు పెట్టాడు. దానికి నసీరుద్దీన్ నవ్వుతూ ఇంట్లోకి వెళ్లాడు. ఒక బెల్లం ముక్క తీసుకొచ్చి నేలమీద పెట్టాడు. ఇహ ఈగలు ఒక్కటొక్కటిగా వచ్చి దానిమీద వాలసాగాయి. 'చూశావా భాయ్! ఆ బెల్లం చుట్టూ ఈగలు ఎలా మూగాయో! ఆ బెల్లం అయిపోయిందనుకో. అక్కడ ఒక్క ఈగ కూడా వుండదు. అలాగే నా దగ్గర సొమ్ము వున్నంత వరకు మిత్రులుంటారు. అదైపోయాక నా స్నేహితులు ఎంతమంది వున్నారనేది లెక్కపెట్టి చెబుతా' అన్నాడు. అప్పుడు ఆ వ్యక్తి విషయం అర్థమైనట్టు తలాడించుకుంటూ వెళ్లిపోయాడు.

మాయమైన గడియారం

...య్! ఇవాళ మీకు ఓ మంచి మేజిక్ గురించి ...ంటున్నా. చెప్పనా! ఓసారి ఓ మేజిక్ షోకి వెళ్లాను. ఆ ... తన చేతిలో వాచీ పెట్టి దానిమీద చేతిరుమాలు వేశాడు. ...వారిని వచ్చి చేతిలో వాచీ వుందో లేదో చూడమన్నాడు. ...ే పదిమంది చూశారు. వాచీ వుంది. ఆ మెజీషియన్ ...బ్రకదబ్రా... వాచీ మాయం దబ్రా...' అంటూ రుమాలు తీశాడు.

...ి చేతిలో వాచీ ...మైపోయింది. ...ద్యం? నేనుకూడా ...నే' అనిపించింది ...ర్శన అయ్యాక ...ెళ్లిపోయాక ....షియన్ దగ్గరకెళ్లా. ... తన వేంకవ్ ...ంటూ ఏంటి ...ైపు చూశాడు. ...వాచీ ఎలా మాయమైందో ...నుంది. దయచేసి చెప్పరూ'అని ...న నావైపు నవ్వుతూ చూసి 'నా చేతిలో వాచీ వుందో లేదో ...ది మంది వచ్చారు. వాళ్లల్లో చివరి వ్యక్తి మా మనిషి. వాచీ ...చూసినట్టు చూసి లాఘవంగా చేతిలోకి తీసుకుని జేబులో ...డు. ఇది నువ్వైనా చేయొచ్చు నీ మిత్రుల సహాయంతో' ...వి సెలవలేకదా. ఈ మేజిక్‌ని మీ స్నేహితులు, ఇరుగు ...ి పోగుచేసి... ఎంచక్కా మెజీషియన్‌లా చేసి చూపించొచ్చు. ...రా.

మేజిక్! మేజిక్!

కలం స్నేహం

పేరు: ఎ.శ్రీకాంత్,
వయసు : 14 సం॥
చదువు : 9 వతరగతి
హాబీలు :క్రికెట్ ఆడడం, చూడడం, డ్రాయింగ్ వేయడం, టీవీ చూడడం, పుస్తకాలు చదవడం, డాన్స్ చేయడం, షెటిల్ ఆడడం.
పూర్తి చిరునామా : ఎ.శ్రీకాంత్, సన్నాఫ్ ఎ.బుద్ధేశ్వరరావు, 10వ వార్డు,10-650(ఎం), మార్కాపురం, ప్రకాశం.



పేరు: పి.మహేష్,
వయసు : 15 సం॥
చదువు : 10 వతరగతి
హాబీలు: క్రికెట్ ఆడడం, కథలు, పేపరు చదవడం, టీవీ చూడడం, డ్రాయింగ్ వేయడం.
పూర్తి చిరునామా : పి.మహేష్, సన్నాఫ్ రాములు, వట్టెం, బిజినపల్లి, మహబూబ్‌నగర్.

హాయ్... వేసవి సెలవలు వచ్చేశాయికదా. మీకు 'కలం స్నేహం' చేయాలని వుందా! అయితే ఓ కార్డు తీసుకుని మీ హాబీలు, అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో ఒకటి ఆ కార్డు మీద అంటించి పోస్టు చేయండి.

పదాల పదనిసలు

?	క్కు
	ట్టా
	దత
	రుత
	త్రం
	న్న

ఒక్క అక్షరం కలపండి

గతవారం జవాబులు

ర	సం
	మ
	బ్బరు
	చ్చ
	గ్గ
	గడ

నోరు పారేసుకున్న వాడు

* రుక్మిణి

ఒక్కసారిగా ఆ వార్త ముందు ఇటు రాష్ట్రంలోనూ... తర్వాత అటు దేశంలోనూ అత్యంత సంచలనం కలిగించింది. సామాన్య ప్రజలు భయంతో నోళ్ళు తెరిస్తే మేధావులు మాత్రం తలలు పట్టుకున్నారు. అసలు మొత్తం ప్రపంచంలో ఏ దేశంలోనైనా ఇలాంటి సంచలన సన్నివేశం జరిగిందా? అని సెమినార్లు... గోష్టులు నిర్వహించి తర్కించడం కూడా మొదలయింది.

"ఓరి జక్కులోడా... మొన్న కరవు సంతకు నువు పోయినపుడు కాస్తంత మందుపీకి రొంటిలోని దబ్బుల్ని పోగొట్టుకున్నవు గదరా!" మల్లేశం జక్కులోడ్ని గుచ్చి గుచ్చి అడిగాడు. వాడు అక్కసుగా "అబ్బో మీ మరదలు పెళ్ళిలో బట్టల్తో వున్న నీ ట్రంకు పెట్టెను నువ్వు పారేసుకోలేదా..." అని ఎదురు దాడికి దిగిపోయాడు.

"మొన్న గుడికి పోయినపుడు నా కాలి వెండి పట్టీలు పోగొట్టుకున్నానే" మల్లమ్మ దాక్రా రంగమ్మతో అంది. "సంబడం... మొన్నటికి మొన్న నా కొత్త చెప్పులు ఇంటి ముందే విడిచి పోగొట్టుకున్నాను" రంగమ్మ మూతి విరిచింది.

అటు పర్సులు పారేసుకున్న వారి సంగతి సరేసరి! రకరకాల ఏక్సిడెంట్లలో చేతులూ.. కాళ్ళూ పోగొట్టుకున్న వాళ్ళు విచారంగా నిట్టూర్చి - విభ్రాంతిగా నోళ్ళు తెరిచారు.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే మన రాష్ట్రమంత్రివర్యులుగారొకరు నోరు పారేసుకున్నారు. విషయం తెలిసీ తెలియగానే ఇటు రాష్ట్ర పోలీసు శాఖ మొత్తం... అటు సి.బి.సి.ఐ.డీ... ప్రైవేటు డిటెక్టివ్ ఏజన్సీలు దాన్ని వెదికి దొరకపుచ్చుకోవడానికి మొత్తం పరిశోధన... రంగంలోకి దిగిపోయారు.

"నోరు పారేసుకోడం ఏంటయ్యా... ఎక్కడా ఏ పురాణంలోనూ, చరిత్రలోనూ ఇట్లాంటి సంఘటనలు చూడలేదు. చదవలేదు.... అంతే కలికాలం...." చరిత్రకారులు... పురాణవేత్తలు పెదవి విరిచి తాళపత్ర గ్రంథాల్లోకి తలలు దూర్చారు!

మంత్రిగారి ఇంటి ముందు జన సందోహం... కోలాహలం మిన్నుముట్టింది. ఎందుకంటే 'నోరు పారేసుకున్న మనిషిని' అంతకుముందు మన సామాన్య జనం అసలు చూసి వుండలేదుగదా.. పోలీసులు మాత్రం జనాన్ని అదుపులో వుంచడానికి నానా తంటాలు పడుతున్నారు. అందర్నీ 'క్యూ'లో క్రమశిక్షణగా వుంచడానికి సతమతమై పోతున్నారు - అటు వీడియో వాళ్ళు అంగలార్చుకుంటూ భుజాల మీద కెమెరాలు మోసుకుంటూ తెగ ఆరాటపడిపోతున్నారు.

"చోద్యం... నోరు పారేసుకోడం ఏంటి? ఆయన ఎక్కడెక్కడ ఎడాపెడా తిరిగాడో ఆ ప్రదేశాలన్నిటినీ పోలీసు కుక్కల్తోగానీ... వెదికిస్తే ఏ తుప్పల్లోనో... రోడ్డు పక్క సైడు కాలవల్లోనో దొరుకుతుందేమో... చూడాలి!" ఒక పోలీసు కడు విచారంగా అన్నాడు.

మంత్రి గారి గదిలో భారీగా సోఫాలో కళ్ళు మిటకరిస్తూ ఆయనగారు నిండుగా తలూపుతూ కూర్చున్నారు. విచిత్రంగా వారికి 'నోరు'వుండాల్సిన చోట అంతా ఖాళీగా... నిండుగా సాఫుగా వుంది. మిగతా అవయవాలన్నీ మాత్రం బాగానే పని చేస్తున్నాయని వైద్యబృందం ఆరాటపడి ఒక స్థిర నిర్ణయానికి వచ్చాయి. విలేకర్లు చాలా తాపీగా ఇంటర్వ్యూ ప్రారంభించారు.

"సార్... మీరు ఎక్కడెక్కడ తిరిగారు.. అసలు మీ నోరు వారెపుడు పారేసుకున్నారో ఏమైనా గుర్తుందా? జాగ్రత్తగా ఆలోచించి సమాధానం ఈ కాగితం మీద రాయండి" అని ఓ విలేకరి నెమ్మదిగా అడిగాడు.

"తెలియదు" అన్న పదం కాగితం మీద గిలికి ఆయనగారు ముందుకు తోశారు. ... "పోనీ... ఎక్కడ పారేసుకున్నారో అదైనా గుర్తుందా??" మరో విలేకరి ప్రశ్నించాడు.

"తెలియదు" అనే సమాధానం గిలికి కాగితం ముందుకు తోసి మంత్రి గారు కండ్లు మిటకరించాడు.

"చేయో... కాలో పారేసుకుంటే ఫర్వాలేదుగానీ... ఏకంగా నోరు పారేసుకోడం చాలా ఇబ్బందికరమైన విషయం... గదా!" మరో విలేకరి ప్రశ్నించాడు.

"నా నోరు... నా ఇష్టం... పారేసుకుంటాను.. మీకేంటి?" మంత్రిగారు మహా రౌద్రంగా అటు ఇటు కదిలి కాగితం మీద బరబరా గిలికి చాలా గుర్రుగా చూశాడు.

"సర్సరె... ఇపుడు నోరు పారేసుకున్నారు.. బాగానే వుంది... మరి ముందు ముందు మీకే ఇబ్బంది గదా!" లౌక్యంగా ఓ విలేకరి అడిగాడు.

"అదే ఆలోచిస్తున్నా... ఇంకా ముందు ముందు వాగవలసిన విషయాలు నా పి.ఏ. ద్వారా వెల్లడి చేస్తాను.. నా ఇష్టం!" నాగం చాలా శాంతంగా కాగితం మీద గిలికాడు. అప్పటికే ఈ సంగతులు బయటకు తెలియడంతో జనం నానా బూతులు తిట్టుకుంటూ ఇళ్ళదారి పట్టారు. విదేశీ వైద్యులు కూడా తలలు పట్టుకుని... సంచీలు సర్దుకుని ప్రయాణానికి సిద్ధపడిపోయారు.

"ఓరి జక్కులోడా... నోరు ఎక్కడ పారేసుకున్నాడో నాకు తెలిసిందిరో.. తెలిసిందిరో...!" మల్లేశం ఆనందంతో చిందులేశాడు. అందరూ ఆశ్చర్యంగా వాని వంక చూస్తూ నోర్లు తెరిచారు.

"కరువు దెబ్బకు జనం తిండి లేక పిట్టల్లా రాలిపోయారు గదా... ఈ రాష్ట్ర ప్రభుత్వ విధానాల దెబ్బకు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వాళ్ళకి మతులు భ్రమించి ఆత్మహత్యలు చేసుకున్నారని ఎద్దేవా చేసి అక్కడ నోరు పారేసుకున్నాడు - అదీ సంగతి!"

జనం నివ్వెర పోయారు. నిజమే... అపుడు రైతుల ఆత్మహత్యల్ని అపహాస్యం చేసి నోరు పారేసుకున్నాడు. అదీ సంగతి!

"మరో సంగతిరో జక్కులోడా... కరువుకు జనం తిండిలేక అల్లాడుతుంటే సి.పి.ఎం. గంజి కేంద్రాలు తెరిచి... ఆ కాలే కడుపులకు ఇంత గంజి నీళ్ళు పోయడానికి సిద్ధపడి.. రాష్ట్రంలోని దయామయుల వద్ద భిక్షాటనకు జోలె పట్టి విరాళాలు అడుగుతుంటే... ఈయనగారేమో "కమ్యూనిస్టులు బిచ్చం ఎత్తుకోడానికి తప్ప మరి దేనికీ పనికిరారు" అని నోరు పారేసుకున్నాడు - అదీ సంగతి యాద్గిరి మరో కారణం వివరించడంతో అక్కడి జనం అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు.

"అయినా ఇట్లా ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకోడానికి మరో మంత్రి కూడా తయారవుతున్నాడు. పాపం... తమ నోళ్ళు ఇట్లా ఎట్లాబడితే అట్లా పారేసుకుంటే చంద్రబాబుగారి కొలువులో మరికాస్తంత ఎక్కువగా గుర్తింపు వచ్చి తోకాడించ వచ్చని మాత్రమే అట్లా నోళ్ళు పారేసుకుంటున్నారు. వాళ్ళ కర్మ! ఇపుడు నోరు పెగిలినా... రేపు జనం బలవంతంగానైనా దాన్ని మూయించి తీరుతారు - తప్పదు!"

యాద్గిరి చాలా నింపాదిగా చెప్పేసరికి జనం అందరూ చప్పట్లు చరిచారు.! ◆

నిత్యదీపావళి....

* లక్ష్మి

ఈ రోజు దీపావళి కాదు. 'అయినా ఆ పండగ ఫిలాసఫీ నాకు సడన్‌గా గుర్తుకొచ్చింది.' అది వివరించేందుకు వచ్చే దీపావళి వరకూ వాయిదా వేయడం ఇష్టం లేక-ఇప్పుడే చెప్పేస్తున్నాను! కాసేపు ఇవాళ దీపావళి అనుకుని చదవండి. సంతోషిస్తాను! సత్యభామా దేవి నరకాసురుడ్ని నరకానికి పంపించిన రోజుగదా దీపావళి! అంటే - మహిళా విజయానికి నీరాజనాలర్పించే రోజు! అంచేత ప్రత్యేకించి ఆడవాళ్ళు మాత్రమే చేసుకోవాల్సిన మహత్తరమైన పండగ! కానీ మగమారాజు ఇల్లాంటి రూల్సు గట్రాలను పట్టించుకోడు! సమస్తమైన పండగలూ తన చేతుల మీదగానే జరగాలంటాడు! అదేమిటని అడిగేమనుకోండి - మీకు శ్రావణ శుక్రవారాలూ, మంగళవారాలూ ఉన్నాయి గదా! వాటితో సర్దుకోండని సలహా ఇస్తాడు!

మగమారాజుతో గొడవ ఎప్పుడూ ఇట్లాగే ఉంటుంది! కుడి పక్కన నడవమంటే - ఎడం పక్క నడిస్తే తప్పేమిటని అడుగుతాడు! సూర్యోదయానికి ముందే నిద్రలేవమంటే - అట్లాంటి దిక్కుమాలిన డ్యూటీల గురించి ఆడవాళ్లకే చెప్పమంటాడు ! వారానికోరోజు తలంటు కోమంటే తనవల్ల కాదంటాడు! ఆడవారి చేతుల్లో తలపెట్టడం గొప్ప ఇన్సల్టంటాడు! ఆమాట కొస్తే - మొగుడికి తలంటే కార్యక్రమం వెనక ఆవిడగారి కుట్ర దాక్కుని ఉంటుందని చెబ్తాడు! వివరించు మహాశయా అని అడిగితే మీటింగు పెడతాడు. తలంటు పేరుమీద వారానికి ఒక్కరోజైనా భర్త కళ్లల్లో కుంకుడు రసం పోసి కసి తీర్చుకునేందుకు ఆడవాళ్ళు ఇట్లాంటి ఏర్పాట్లు చేస్తున్నారని చెబుతాడు. ఈ సందర్భంగా పిట్టకథ కూడా చెబ్తాడు. కళ్లల్లో కుంకుడు రసం పోసి - నాకు పట్టు చీర ఎప్పుడు కొంటారని అడుగుతుంది! ముందు తలమీద నీళ్ళు పోయ్ కళ్లు మండుతున్నాయని భర్త ఆర్తనాదం చేస్తాడు! పట్టుచీర సంగతి చెబితేనే గాని నీళ్లు పోయనంటుంది!

తప్పని పరిస్థితుల్లో - వచ్చేవారం తప్పకుండా కొంటానని అంటాడు! బాబిగాడి మీద ఒట్టేసి చెప్పండని అంటుంది! కళ్లు మండి పోవడం కంటే - ఒట్టేసి మంట నుంచి బయటపడటమే బెటరని బాబిగాడి మీద ఒట్టు అంటాడు! వచ్చేవారం నీకు పట్టుచీర కొంటానంటాడు! అప్పుడు గాని నెత్తిమీద నీళ్ళు పడవు! బాబిగాడి మీద ఒట్టేసిన పాపానికి వచ్చేవారం వెయ్యి రూపాయలు గోవిందా అని గొణుక్కుంటాడు! ఈ కష్టాలు పడే ఓపిక లేక నాకు తలంటు వద్దని బోర్డు కడతాడని కథ ముగిస్తాడు! అంతేగాని - ఆరోగ్యానికి తలంటు శ్రేష్టమని - అందుకే ఆవిడ తన పట్ల అంత శ్రద్ధ తీసుకుంటోందని అనుకోడు! తనకు అనుకూలంగా ఉండే ప్రతి సన్నివేశానికీ చెయ్యెత్తి జైకొడతాడు! ప్రతికూలంగా వుండే విషయాల మీద దుమ్మెత్తి పోస్తాడు!

ఇది ఇప్పటి తంతు కానేకాదు. తరతరాల నుంచి తరుముకొస్తున్న తతంగం! అంచేత నరకాసురుడ్ని నరికేసిన కీర్తి స్త్రీ జాతికి చెందినా - పండగ మాత్రం మగరాజు చేతుల మీదగానే జరుగుతుంది! దీపావళి నాడు ఇంట్లో కూచుని దేవీపూజలూ వగైరాలు ఇల్లాల్ని చేసుకోమంటున్నాడు! తాను మాత్రం వీధిన పడి ఆటంబాంబులు పేలుస్తున్నాడు! ఆపాటి ఆటంబాంబులు ఆడవాళ్లు కూడా నిర్భయంగా కాల్చగలరు. ఆ సంగతి అతనికి బాగా తెలుసు. కానీ కాల్చనివ్వడు! మిస్ ఫైరైతే చీరంటుకుని వళ్లు తగలబడి పోతుందని బెదరగొడతాడు. అనకాపల్లిలో అరవైమంది ఆడవాళ్లకి అదే జరిగిందని చెప్పి అదరగొడతాడు. అదేదో మగవాళ్లు మాత్రమే చేయతగ్గ వీరోచిత కార్యమైనట్టు కట్టుకథలు చెబ్తాడు. పైగా - రోడ్డున పడి ఆటంబాంబులవీ పేల్చడం ఆడలక్షణం కాదని వేదాల్లో చెప్పేరని మందలిస్తాడు! ఇంత ఉపన్యాసం వెనక దాక్కున్న అసలు పాయింటు మాత్రం చచ్చినా చెప్పడు! ఆటంబాంబులు నువ్వు కాల్చి, నేనూ కాల్చితే నా హీరోయిజం మట్టికొట్టుకుపోతుంది గనక - నా అర్ధాంగివైన నువ్వు ఆటంబాబుల జోలికి వెళ్ళకుండా, ఇంట్లో కాకరపువ్వొత్తులు మాత్రమే వెలిగించి ఆనందించు సుమా అనే నిజాన్ని దాచేస్తున్నాడు!

ప్రత్యేకించి దీపావళి నాడు మాత్రమే మగమారాజు ఈ విన్యాసాలు చేస్తున్నాడనీ - మిగతా రోజుల్లో ఎంతో వినయంగా వుంటాడనే గ్యారంటీ లేదు! దీపావళి నాడు ఆటంబాబులవీ పేల్చి పెట్రేగి పోతున్నాడు! మిగతా రోజుల్లో ఆటంబాబులకు ఏ మాత్రం తీసిపోని విధంగా హడావిడి చేస్తూ ఇంట్లోవాళ్ళని కాల్చుకుతింటో కాలక్షేపం చేస్తుంటాడు! అంచేత ఆ మహాశయునికి నిత్యం దీపావళే! అయ్యగారికి కారణం లేకుండానే కోపమొస్తుంది. దాంతో సీమ టపాకాయలాగా చిటపటలాడతాడు. బవుండు పుస్తకాన్ని నేలకేసి కొడతాడు. అది ఢామ్మంటుంది. ఆ శబ్దం అతనికి గొప్ప ఉత్సాహాన్నిస్తుంది! వంటగదిలోకి వెళ్ళి కంచాన్ని విసురుతాడు! అది విష్ణు చక్రమల్లె ఎగిరి టాపుకి తగిలి - చిత్రమైన శబ్దం చేసుకుంటో నేలమీద పడుతుంది! సెభాషనుకుంటాడు. తలుపుని కాల్తో కొడతాడు. అది ఔటుపేలిన శబ్దాన్ని సరఫరా చేస్తుంది! విని ముచ్చట పడతాడు. పప్పు, ఉప్పుగాల్లోకి విసురుతాడు! అది చిచ్చుబుడ్డి వెదజల్లిన పువ్వుల్లాగా ఎగిరెగిరి పడతాయి. ఈ విధంగా సంవత్సరం పొడుగునా ప్రాక్టీసు చేస్తాడు! గనకనే - దీపావళి నాడు వీధుల్లో ఎగబడి ఆటంబాంబులు కాల్చేందుకు కాలు దువ్వుతున్నాడని చాలా సుళువుగా చెప్పచ్చు! ఆడుకోనివ్వండి పాపం! వీల్లేదంటే - ఇంట్లో చిందులు తొక్కుతాడు. ఇంట్లో చిందుల కంటే వీధిలో చిటపటల్తో ఆడుకోడమే బెటరు! ◆



క్షేత్రంలోని పెద్ద కోనేరు

మద్దులేటి స్వామి

రాకెట్ల వీరన్న

మనోహరం మద్దులేటి క్షేత్రం

ఎత్తయిన కొండలు, గలగల పారే ఏర్లు, జలజల రాలే నీటి ధారలు ప్రకృతిలోని అందాలన్నీ తనలో ఇముడ్చుకున్నట్లు ముగ్ధ మనోహరంగా ఉంటుంది మద్దులేటి స్వామి క్షేత్రం.

కర్నూలు జిల్లా బేతంచెర్ల మండలం, ఆర్.ఎస్.రంగాపురానికి 6 కి.మీ. దూరంలో ఆ క్షేత్రం ఉంది. ప్రతి శనివారం లక్షలాది మంది, రాష్ట్ర, రాష్ట్రేతర పర్యాటకులు, భక్తులు ఇక్కడకు వస్తుంటారు. ఈ క్షేత్రంలో కొలువున్న స్వామి లక్ష్మీనరసింహస్వామి,. ఈయనను మద్దులేటి లక్ష్మీనరసింహస్వామి అని కూడా పిలుస్తారు. 'మద్దులేరు' అనే ప్రవాహం ఒడ్డున ఈ స్వామి వెలసి ఉన్నందున ఈయనకు ఈ పేరు వచ్చింది. ఈ క్షేత్రమునకు కర్నూలు జిల్లా బేతంచెర్ల మండలం కేంద్రం నుండి, డోన్ మండల కేంద్రం నుండి బస్సు సౌకర్యం కలదు. అంతేకాక నంద్యాల నుండి డోన్ నుండి రైలు సౌకర్యం కలదు. ఆర్.ఎస్.రంగాపురం రైల్వేస్టేషన్ వద్ద దిగి, అక్కడి నుండి బస్సులో ఈ క్షేత్రానికి వెళ్ళవచ్చు.



క్షేత్రంలోని చిన్న కోనేరు

గలగల ధ్వనులతో జలజలా ప్రవహించే మద్దులేరు ప్రాంతం చూపరులను ఇట్టే ఆకర్షిస్తుంది. ఏపుగా పెరిగిన మద్దిచెట్లు ఇక్కడ గుంపులుగుంపులుగా ఉండి, ఈ ప్రాంతం పక్షుల కిలకిలా రావాలతో ఆహ్లాదంగా ఉంటుంది. ఎర్రమల సానువుల మధ్య వున్న ఈ ప్రాంతం ఎప్పుడూ నీటితో ఉంటుంది. అందుకేనేమో లక్షలాది మందిని ఆకర్షిస్తుంది.

ఈ మద్దులేటి నరసింహస్వామి కదిరి ప్రాంతం (అనంతపురం జిల్లా) నుండి ఇక్కడికి వచ్చారని స్థల పురాణం చెబుతుంది. కదిరి లక్ష్మీ నరసింహుడు తన భార్యతో పాచికలాడగా, తాను ఓడిపోతే, ఆమెచే పరిహసింపబడిన స్థితిలో అలిగి యాగంటి క్షేత్రం చేరాడని, అప్పుడు యాగంటీశ్వరుడు ఈయన రాకకు కారణమడుగగా, నేనిక్కడ ఉండదలచుకున్నా ననగా, ఈ మద్దులేరు ప్రాంతాన్ని యాగంటీశ్వరుడు చూపించగా, లక్ష్మీనరసింహుడు ఇక్కడ స్థిరపడినట్లు స్థల పురాణం చెబుతుంది. మద్దులేరు పక్కన వెలసినందున ఈయనకు మద్దులేటి నరసింహస్వామి అని పేరు వచ్చింది.

ఈ ఆలయానికి సంబంధించి ఓ కథ ప్రచారంలో ఉంది. హిరణ్య కశ్యపుని భయంకరంగా చంపి, వాని రక్తమాంసాలారగించిన ఈ ఉగ్రనరసింహతత్వాన్ని హింసావాదులు, జంతుబలితో సంతృప్తి పరచి తమ కోరికలు తీర్చుకొందురని లక్ష్మీదేవి శపించిందట. అప్పటి నుండి మద్దులేటి స్వామికి భక్తులు కోళ్ళు, మేకలు బలిస్తున్నారు. జంతు బలిపై నిషేధం విధించినప్పటికీ ప్రతి శనివారం వందలాది జంతువుల్ని ఇక్కడ బలిస్తుంటారు. ప్రతి శుక్రవారం రాత్రి ఇక్కడకు భక్తులు చేరి, శనివారం పూజలు జరుపుకొని ఆదివారం తిరిగి వెళ్తుంటారు. లక్ష్మీదేవి శాపంతో స్వామి ఫాల్గున శుద్ధ పౌర్ణమి శనివారం రోజున ఇక్కడ శిలగా మారడంతో శనివారాన్ని పూజాదినంగా ఎంచుకున్నట్లు నానుడి.

సాధారణంగా దేవుళ్లను దర్శించాలంటే కొండలనెక్కాలి. కాని ఇక్కడ అందుకు విరుద్ధంగా కొండను దిగి లోతైన ప్రాంతం చేరితే అక్కడ గుడి కనిపిస్తుంది. ఈ లోతైన ప్రాంతం ప్రకృతి శోభితమై, మానసిక ప్రశాంతతకు నిలయమై ఉంటుంది. నలుదిక్కుల ఎత్తయిన కొండ చరియల మధ్య ఈ గుడి ఉంటుంది. విశాలమైన సెలయేళ్ళు ఇక్కడ ఉన్నాయి.

ఈ మద్దులేటి స్వామిని దర్శించే వారిలో అత్యధికులు సంతానం కావాలనే కోరికతో ఇక్కడకు వచ్చి పూజలు చేస్తుంటారు. సంతానం లేని దంపతుల కోసం ప్రతి శుక్రవారం రాత్రి ఇక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేస్తారు. దంపతులలో ఎవరో ఒకరు పూజా కార్యక్రమంలో పాల్గొనవచ్చు. దేవుడి విగ్రహం భుజాలపై వారు తెచ్చిన పూలమాలను వేస్తారు. భక్తులు స్వామి వారి ఎదురుగా కూర్చుంటారు. పూజారి మంత్రాలు పఠించి భక్తునికి సంతాన భాగ్యం కలుగుతుందా లేదా అని బిగ్గరగా అరుస్తాడు. అలా ఒక నిమిషం పాటు ప్రశ్నించిన తరువాత పూలమాల మెల్లిగా జారి కింద పడిపోతుంది. ఇలా కింద పడితే తమకు సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అది మహత్యంతో పడిందా లేక పూజారి బిగ్గరగా అరవడంతో ధ్వని ప్రకంపనవల్ల పడిందా అనేది వేరే విషయం. భక్తులకు మాత్రం స్వామిపై నూటికి నూరుశాతం నమ్మకం, కొందరిని ప్రశ్నిస్తే తమకు ఇక్కడకు వచ్చిన తర్వాత సంతానం కలిగిందని చెబుతుంటారు. ఇలాంటి మూఢనమ్మకం ఒకటి ఇక్కడ ప్రచారంలో ఉంది. దాన్ని భక్తుల విశ్వాసానికే వదిలేద్దాం.

ఏదిఏమైనా అందమైన ఈ ప్రాంతం ప్రతి ఒక్కరూ (భక్తులు, పర్యాటకులు) చూడదగినవి. ఇక్కడ అన్ని వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయబడ్డాయి. దీనిని మరింత శ్రద్ధ తీసుకొని అభివృద్ధి చేస్తే ఇది పుణ్యక్షేత్రం కంటే కూడా ఎక్కువగా పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందే అవకాశముంది. ◆

టెన్నిస్ చరిత్రలో చెరిగిపోని ఘటన

గ్రాఫ్ వీరాభిమాని కత్తివేటుకు గురైన సెలెస్‌కు ప్రాథమిక చికిత్స చేస్తున్న వైద్యులు

✻ ఇంజమాముల్ షరీఫ్

గత పదేళ్ల కాలంలో మహిళా టెన్నిస్‌లో భారీ మార్పులు జరిగాయి. పదేళ్ల క్రితం ఒక సామాన్య వ్యక్తి ప్రముఖ క్రీడాకారిణిపై కత్తితో దాడి చేసిన తర్వాత మహిళా టెన్నిస్‌లో నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. 1993 ఏప్రిల్ 30వ తేదీన హాంబర్గ్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఒకమ్యాచ్ మధ్యలో మోనికా సెలెస్ విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఒక సంచలన సంఘటన చోటుచేసుకుంది. విశ్రాంతి సమయంలో వందలాది మంది అభిమానులు ఆటగాళ్లను అభినందించడం, ఆటోగ్రాఫ్‌లు తీసుకోవడం మామూలే. గత రెండేళ్లలో ఆరు గ్రాండ్‌శ్లామ్ టైటిళ్లు సొంతం చేసుకున్న 19 ఏళ్ల సెలెస్ కుర్చీపై తీరికగా కూర్చొని మెగ్దలేనా మలీవాతో తదుపరి ఆడాల్సిన మ్యాచ్ గురించి పథకాలు రచిస్తోంది. ఆమె జ్వరం కారణంగా అప్పటికే రెండు నెలలుగా టెన్నిస్‌కు దూరంగా ఉంది. ఆ మ్యాచ్‌లో అప్పటి వరకు 6-4, 4-3తో ఆధిక్యంలో ఉంది. అకస్మాత్తుగా సెలెస్ వీపుపై పదునైన కత్తితో దాడి జరిగింది. ప్రేక్షకుల గ్యాలరీ నుండి ఒక వ్యక్తి నేరుగా సెలెస్ కూర్చున్న కుర్చీ వద్దకు వచ్చి కత్తితో దాడి చేశాడు. అతన్ని ఆ సమయంలో ఎవరూ ఆపడానికి కూడా ప్రయత్నించలేదు. ఆ కత్తి సెలెస్ ఎడమ భుజం కింది భాగంలో తగిలింది. వెంటనే జర్మనీకి చెందిన అధికారి పరుగెత్తుకొచ్చి కత్తిని పీకేశాడు. షాక్‌కు గురైన సెలెస్ భయం, బాధతో తల్లడిల్లి పోయింది. ప్రథమ చికిత్స చేసి సమీపంలోని హాంబర్గ్ ఆసుపత్రికి తరలించారు.

ఆ సంఘటన టెన్నిస్ చరిత్రను పూర్తిగా మార్చివేసింది. అప్పటి నుండి క్రీడాకారులకు, అభిమానులకు మధ్య దూరం పెరిగింది. అభిమానులంటేనే ఆటగాళ్లు భయపడసాగారు. నిర్వాహకులు భద్రతను ఒకటికి రెండుసార్లు సమీక్షించుకుంటున్నారు. ఈనెల చికాగోలో జరిగిన ఒక మ్యాచ్ సందర్భంగా ఒక అభిమాని మైదానంలోకి దూసుకొచ్చి అంపైర్‌తో వాదనకు దిగాడు. దాడికి గురైన పది సంవత్సరాల తర్వాత ఇప్పటికీ సెలెస్ క్రీడారంగంలో కొనసాగుతోంది. ఆరోజు జర్మనీలో జరిగిన దాడి గురించి చర్చించడానికి సెలెస్ ఇప్పటికీ ఇష్టపడదు. అయితే గత నెల ఫ్లోరిడా టోర్నమెంట్ సందర్భంగా ఆమెను తన కెరీర్ గురించి వివరించాలని విలేకరులు కోరారు. "గతం గురించి ఆలోచించటం నాకు ఇష్టముండదు. నేను మారిపోయాను. దాడికి గురైన తర్వాత నా ఆటతీరులో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి" అని సెలెస్ తెలిపింది. 1991వ సంవత్సరంలో స్టెఫీగ్రాఫ్ నుండి మహిళా టెన్నిస్‌లో అగ్రస్థానాన్ని సెలెస్ చేజిక్కించుకుంది. సెలెస్‌ను గాయపర్చడం ద్వారా గ్రాఫ్ మళ్లీ అగ్రస్థానాన్ని సాధించే అవకాశం కల్పించాలని దాడి చేసిన వ్యక్తి పథకం పన్నాడు. మహిళా టెన్నిస్‌లో క్రిస్ ఎవర్ట్‌కు మార్టినా నవ్రతిలోవా ప్రధాన ప్రత్యర్థిగా చాలాకాలం కొనసాగింది. కానీ గ్రాఫ్‌కు కూడా సెలెస్ కొరకరాని కొయ్యగా మారుతోంది. 1988లో నాలుగు గ్రాండ్‌శ్లామ్ టైటిళ్లు కైవసం చేసుకోవడంతో ఆమె ఒక్కసారిగా నెంబర్ వన్ స్థానానికి ఎగబాకింది. దాడికి గురైనప్పుడు సెలెస్ నెంబర్ వన్‌గా కొనసాగుతోంది. గత రెండు సంవత్సరాల నుండి ఆమె ఆస్ట్రేలియా, ఫ్రెంచ్, యు.ఎస్. ఓపెన్ టైటిళ్లు సాధిస్తోంది. ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను వరుసగా మూడు సార్లు కైవసం చేసుకున్న ఘనత గ్రాఫ్ తర్వాత ఈమెకే దక్కింది. దాడికి ముందు ఐదేళ్లలోనే సెలెస్ మొత్తం 30 టైటిళ్లు హస్తగతం చేసుకుంది. అందులో ఎనిమిది గ్రాండ్‌శ్లామ్ టైటిళ్లు ఉన్నాయి. అప్పుడే గ్రాఫ్ అభిమాని దాడి చేశాడు.

కోలుకోడానికి 27 నెలలు

కత్తి త్వరగానే బయటపడింది. కాని దాడి తాలూకు షాక్ నుండి కోలుకోడానికి సెలెస్‌కు చాలాకాలం పట్టింది. ఆమె 27 నెలలపాటు టెన్నిస్ బ్యాట్ ముట్టలేకపోయింది. ఆమె మళ్లీ దారిలోకి వచ్చేందుకు స్నేహితులు, సహచర క్రీడాకారిణులు చాలా ప్రయత్నించారు. అందులో నవ్రతిలోవా ముఖ్యురాలు. "సెలెస్, నేను మంచి స్నేహితులం. ఆమె మళ్లీ రాకెట్ పట్టి మైదానంలోకి దిగాలని ఆకాంక్షించే వాళ్లలో నేను మొదటి దాన్ని. దానికోసం ఏ సహాయం చేయడానికైనా నేను సిద్ధమే" అని నవ్రతిలోవా స్వాంతన వచనాలు పలికింది. "ఇలాంటి సంఘటన గతంలో ఎవరికీ ఎదురుకాలేదు. దాన్ని సాధ్యమైనంత త్వరగా మరిచిపోయి టెన్నిస్ ప్రపంచంలోకి అడుగు పెట్టడం సెలెస్‌కు అవసరం" అని నవ్రతిలోవా పేర్కొంది. ఎట్టకేలకు 1995 ఆగస్టులో న్యూజెర్సీలో నవ్రతిలోవాతో సెలెస్ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడింది. ప్రారంభంలో ఒత్తిడికిలోనై డబుల్ ఫాల్ట్ చేసినప్పటికీ తర్వాత తేరుకొని ఆ మ్యాచ్‌లో విజయం సాధించింది. దీంతో ఆత్మవిశ్వాసం మళ్లీ పుణికిపుచ్చుకున్న సెలెస్ టొరంటోలో కెనడా ఓపెన్ టోర్నమెంట్‌లో పాల్గొన్నది.

మళ్లీ జైత్రయాత్ర

యు.ఎస్. ఓపెన్ టోర్నమెంట్ నుండి సెలెస్ జైత్రయాత్ర కొనసాగింది. ఆ టోర్నీలో ఆమె ఫైనల్ వరకూ దూసుకెళ్లింది. కానీ ఫైనల్లో గ్రాఫ్ చేతిలో 7-6 (6), 0-6, 3-6 తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. ఆమె మళ్లీ గాడిలో పడిందనడానికి ఇదే నిదర్శనం. దాడి గురించి గుర్తు చేసినప్పుడల్లా 'అది ఫ్లాష్‌బ్యాక్' అని కొట్టిపారేయడం నేర్చుకుంది. 1996లో నాలుగో సారి ఆస్ట్రేలియా టైటిల్ సొంతం చేసుకుంది. 1998లో కూడా ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ వరకూ చేరుకుంది. ఇప్పుడు ఆమె భుజం నుండి మోకాలి వరకు అన్నిచోట్లా గాయాలకు గురైంది. ఇప్పుడు 29 ఏళ్ల వయస్సులో 12వ ర్యాంకు కలిగిన సెలెస్ మహిళా టెన్నిస్‌ను శాసించేస్థాయి లేదు. దాడి తర్వాత ఆమె జర్మనీలో మళ్లీ ఆడలేదు. సెలెస్‌పై దాడిచేసిన వ్యక్తిని ఆరునెలలు కస్టడీలో ఉంచి తర్వాత విడుదల చేశారు. కానీ సెలెస్ క్రీడా జీవితానికే పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ◆

✻ తెలకపల్లి రవి

గీత్ గాతా హు మై..

జీనా యహా, మర్‌నా యహా
ఇస్‌కే సివా జానా కహా

ముఖేష్ గొంతులోని విషాద గాంభీర్యాన్ని ప్రతిధ్వనిస్తూ శ్రావ్యమైన కంఠం..

దాని గురించి ఆలోచించేలోగానే కండక్టరు ఆగమనం

ఎక్కడికి..

మీరెక్కడికి..

ఈ బస్సు పోదు..

చిల్లరివ్వండి..

వచ్చే స్టాప్.

ఇలా ఏదో చెబుతూ నా దాకా వచ్చాడు.

"పాస్ "అన్నాను.

"చూపించండి "

తీయబోతుంటే ఆగకుండానే వెళ్లిపోయాడు.

ఊరికే కన్ఫర్మ్ చేసుకోవాలనుకుని ఉంటాడు.

ఈ రోజులలో అదీ అవసరమేలే.

అనుకుంటుండగానే ఎవరో సీట్లో ఉన్న వ్యక్తి దిగిపోవడానికి రెడీ అవుతున్న సూచన.

హమ్మయ్య, కాస్త కాపు కాసి సీటు పట్టేశాను. మా వూళ్లో అయితే ఖాళీ అయ్యే సీటును ఆక్రమించడానికి సీఎం సీటు లెవల్లో పోటీలు. సిటీలో అంత గొడవపడరు. వీళ్లు నిలబడి ప్రయాణించడానికి అలవాటు పడిపోయిన వాళ్లలా వుంటారు.

అయినా ఈ రద్దీలో, హడావుడిలో నిలబడింది,కూచున్నది మనకైనా తెలుస్తుందా?

ఆ తోసులాటలోనే ప్రతివారూ ఏదో ఆలోచిస్తూ, చర్చిస్తూ.

షేర్లు, సినిమాలు, రాజకీయాలు, స్కాండల్స్, గాసిప్స్, కోతలు, బూతులు, జీవితపు వెతలు అన్నీ షరా మామూలే.

అసలు పది మంది కలిసే చోటేదైనా ఇంతేనేమో. ఎక్కువ మంది ఎదురుగా లేని వాళ్లను గురించి ఎక్కువ సార్లు చెడుగా మాట్లాడుతుంటారు. ముగ్గురిలో ఒకడు దిగిపోగానే మిగిలిన ఇద్దరూ వెళ్లిన వ్యక్తిపై ఏదో అంటారు.

తమను తాము తిట్టుకునే వారు, తమనుతాము పొగుడుకునే వారు.. బస్సు అంటే కదిలే మినీ దునియా అనిపిస్తుంటుంది నాకెప్పుడూ. ఆర్‌కె నారాయణ్ గుంపును తానెప్పుడూ వదులుకోను అంటాడు అందుకేనా?

ఏదో ఆలోచిస్తుండగా మరో సారి వీనుల విందు..

బహారో ఫూల్ బర్‌సావో, మేరా మెహబూబు ఆయా,, మేరా మెహబూబ్‌ఆయా..

చాలా ఆనందం వేసింది. పాడేది నా పక్కనున్న అబ్బాయేనని తెలిశాక అది పెరిగింది.

ఆఫీసు చింతలు, అనంత మీమాంసలు ఆపేసి పాట వినసాగాను.

మరీ బిగ్గరగా కాదు, అలా అని మరీ కూని రాగమూ కాదు. ఒక శ్రుతిలో పాడుతున్నాడు.

అటు తిరక్కుండా వినసాగాను.

ఇంతలో మరో పాట ఎత్తుకున్నాడు.

హమ్ ఇస్ దేశ్‌వాసీహై
జిస్‌దేశ్ మె గంగా బహీతీ హై

చాలా పాటలు వచ్చినట్టుంది. ఇలా పాడేస్తున్నాడంటే బస్సులో రెగ్యులర్ ప్యాసింజరై వుంటాడు.

ఆ పాటలు ఎవరైనా వింటున్నారా? లేక విసుక్కుంటున్నారా?

నా వరకూ నేను ఆలోచనలకు అంతరాయం కలిగినందువల్లనే వాటిని గమనించాను.

కాకపోతే సంగీతం అంటే చెవులు కోసుకోకపోయినా ఇష్టపడతాను గనక కాస్సేపట్లోనే అదంతా మరచిపోయాను.

ఇతరులూ అంతేనా?

ఏమో.. ఎలా చెప్పగలం?

ఎవరి దృష్టి వారిది.

అదుగో ఆయనెవరో ఆ అబ్బాయిని కోపంగా చూస్తున్నట్లుంది.

అయినా మనం అనుకునేదాన్ని బట్టి అలా కనిపిస్తుంటుంది కూడా.

ఇతరుల సంగతి మనకెందుకు, అతని పాటలు నాకెలా వున్నాయి?

అతనలా పాడటం నాకు నచ్చుతున్నదా?

ఆలోచించి చూస్తే నచ్చినట్టే అనిపించింది.

పాడుతున్న పాటలు, పాడే తీరు మాత్రమే కాదు- అసలు పాడటం కూడా!

* * *

బస్సులో అంత మంది అన్ని

మాట్లాడుతూ శబ్దకాలుష్యం సృష్టిస్తుంటే అతనెందుకు పాడకూడదు?

రేడియోలు వినేవారు, టూ ఇన్ వన్‌ల వాళ్ళు, చెవులలో ఇయర్‌ఫోన్లు పెట్టుకుని క్యాసెట్లు వినే సంగీత ప్రియులు ఈ సజీవ సంగీతమెందుకు ఆస్వాదించకూడదు?

ప్రశ్నలు.. ప్రశ్నలు.. ప్రశ్నలే ప్రశ్నలు.

కాని ఎవరిని అడిగేట్టు? ఎవరు జవాబు చెప్పేట్టు?

మనలను మనవే ప్రశ్నించుకుని సమాధానపడటం తప్ప.

మళ్లీ వేదాంతపు ఛాయలకు పోతున్నట్టు సందేహం కలిగి, సంగీతం వైపు మరలాను.

అతను ఇంకేదో పాట ఎత్తుకున్నాడు

ఆజా మేరి చాంద్‌మా రాత్ ఆజా...

ఇక అతన్ని ఇంటర్వ్యూ చేయకుండా నాలోని జర్నలిస్టును ఆపడం అసంభవం.

* * *

మీరు ఎప్పుడూ ఇలాగే పాడుతుంటారా?

అనుకోని ఈ హఠాత్ సంభాషణకు అతని గానవాహిని ఒక్కసారిగా ఆగింది.

"ఈజిట్ డిస్ట్రబింగ్‌యూ.. సారీ.."

ఓహో..అదీ సంగతి. తెలుగు వాడు కాదన్నమాట.

"నాటెటాల్. ఇన్‌ఫాక్ట్ ఐ యామ్ ఎంజాయింగ్ దెమ్ థరోలీ. బైదిబై

"డూ యూ లైక్ మ్యూజిక్ సోమచ్?"

"అఫ్‌కోర్స్. ఐ లైక్ ఓల్డ్ ఫిలిం సాంగ్స్. ఐ గాట్ఎ వండర్ ఫుల్ కలెక్షన్."

"ఇట్స్ గ్రేట్. యూ ట్రావెల్ బై దిస్ బస్ ఎవ్విరి డే".

య్యా.

"డూయూ సింగ్ లైక్ దిస్ ఎవ్విరి డే?"

అతనిలో ఒకింత బిడియం.

"నాటెక్సాక్ట్లీ ఇఫ్ పాజిబుల్ ఐ లైక్ టు సింగ్. బట్ మై ఫెలో ట్రావెలర్స్ మే నాట్ లైకిట్.. సో"

"వై హెజిటేషన్. సింగింగ్ ఈజ్ నాట్ ఎ బ్యాడ్ థింగ్. ఈవెన్ బస్ పీపుల్ ప్లే మ్యూజిక్. దెన్ ఎ గుడ్ సాంగ్‌స్టర్ లైక్ యూ షుడ్ సింగ్."

అతన్ని ప్రోత్సహించాలని బయలు దేరి నేనే ఉత్సాహపడటం మొదలెట్టానా?

అతను జవాబు చెప్పేలోగానే ఎవరో ఏదో అడిగారు.

"అబ్బే లేదండీ..ఈ బస్సు అటు వెళ్లదు.."

అతనే జవాబు చెప్పాడు.

"అరే, మీకు తెలుగు వచ్చా? మరింత సేపూ.."

"మీరు ఇంగ్లీషులో అడిగితే నేనూ అలాగే చెప్పాను."

ఇంకో సందర్భంలోనైతే తెలుగు భాష సంస్కృతుల గురించి లెక్చరు ఇచ్చేవాణ్ణేమో గాని ఆ సమయంలో సంగీతం నుంచి పక్కకు పోవడం ఇష్టంలేకపోయింది.

* * *

"మీరు ఇలా పాడుతూ ప్రయాణం చేయడం అద్భుతంగా వుంది. నాకూ పాటలంటే ప్రాణం. వందల పాటలు నోటికి వచ్చు. కాని ఏం లాభం? పాడలేను."

"ప్రాక్టీసు చేయండి."

"ఇంకేం చేస్తాం లెండి. చేయవలసినవి చాలా వున్నాయి. మీలాటి వాళ్లు పాడితే సంతోషిస్తుంటాను.

కాని ఇందాక అన్నారే, పాతపాటలే బావుంటాయి అని అలా అనుకోకండి. కాలం మారుతుంటుంది. దాంతో పాటే అన్ని మారుతుంటాయి.. మనం ఆ మార్పు మంచి వైపు జరిగేలా చూడాలంతే.." నా ధోరణిలో మాట్లాడాను.

"కాని ఇప్పటి పాటలలో సాహిత్యం ఎక్కడుందండీ? అంతా హడావుడి తప్ప. అసలు పదాలే వినపడవు."

"నిజమే ననుకోండి.."

ఇంతసేపు సీరియస్‌గా మాట్లాడుకోవడం చుట్టుపక్కల వాళ్లకు నచ్చినట్టులేదు. వంకర ముఖాలతో చూస్తున్నారు. ఏ ఇద్దరైనా మరీ సన్నిహితంగా మాట్లాడుకోవడం చాలా మందికి నచ్చి చావదు.

"పాడండి మరి... వింటాను..."

అతను పాడటం మొదలెట్టాడు. కాని అదివరకటి సహజత్వం లేదు.

ఎప్పుడైనా ఏదైనా అంతే. సహజంగా నిర్నిరోధంగా జరిగినప్పుడు ఇచ్ఛికంగా, అప్రయత్నంగా జరిగినప్పుడు వుండే విలక్షణత అనుకూలవాతావరణంలోనైనా రాకపోవచ్చు.

అయినా అతన్ని చిన్నబుచ్చడం ఇష్టం లేక ప్రసన్న వదనంతో వినసాగాను.

అతను అదే పనిగా పాడటం, పక్కనున్న నేను ఏమీ అనకపోవడం గమనించి కండక్టరుతో సహా ఇతరులు ఆశ్చర్య వదనాలతో అటూ ఇటూ చూశారు.

నేను పట్టించుకోనట్టు నటించాను.

* * *

"అరే, మాటల్లో పడి మరచి పోయాను.. నా స్టాప్ వచ్చేసింది సార్ కొంచెం ముందుగా ఆపమని డ్రైవర్‌కు చెప్పాలి. వెళ్తాను.." అంటూ లేచాడు. "థాంక్యూ వెరీ మచ్.." మరీ మరీ చెప్పాడు.

"భలేవారే, నాకెందుకు థాంక్స్ చెప్పడం. పాడింది మీరు.. పాడుతూనే వుండండి. బాగా నేర్చుకోండి."

"మళ్లీ ఎప్పుడైనా కలుద్దాం సార్.."

"ఇలా బస్సులో కాదు మీ గాన ప్రవాహంలో .."

"తప్పకుండా." అతను లేచి వెళ్లిపోయాడు.

ఎవరో ఆ సీటు ఆక్రమించారు.

* * *

దాదాపు అర గంట నుంచి నన్ను, నా ఆలోచనలను నింపేసిన గానం ఒక్కసారిగా అదృశ్యమవడంతో ఏదో ఖాళీ అయిన ఫీలింగ్. ఈ లోగా డ్రైవర్ క్యాసెట్ వేశాడు. **ఛోలీ కే పీఛే క్యా హై** పాటతో బస్సంతా ఒక్క సారి హుషారు!

ఇంతలోనే హఠాత్తుగా ఆగిపోయింది.

సంగీత ప్రియులు నిరుత్సాహంతో నిట్టూర్చేలోగానే బస్సు గేట్లోంచి తియ్యని పాట, బిగ్గరగా..

గీత్ గాతా హు మై.. ముస్కురాతా హు మై..

అందరి దృష్టి ఒక్కసారిగా అటు మళ్లింది. లేచి చూశాను.

ఇందాకటి మిత్రుడే!

పాటలు పాడుతూనే వున్నాడు.

అతను డ్రైవర్ దగ్గరకు ఎందుకు వెళ్లాడో ఇప్పుడు నాకు అర్థమైంది.

పాడుతూ ఆనందంగా చేయూపుతున్నాడు.

నేను అంతకంటే సంతోషంగా జవాబిచ్చాను.

నాక్కొంచెం నమ్మకమివ్వు సోనియా.. బైరాగి కవిత గుర్తొచ్చింది.

పద పదవే గీతమా, పదవే నా ప్రాణమా

తోరణాలు తీరి జనం బారులుగా నిలిచిరే

మగ్దుం పాట గుర్తొచ్చింది.

◆

ఆంధ్రప్రదేశ్ ప్రాక్-పురాయుగ చరిత్ర

ఇంతవరకు ఆంధ్రప్రదేశ్ చరిత్ర-సంస్కృతులకు సంబంధించి వచ్చిన పుస్తకాలు ఈ విషయమై మరింత సమగ్ర అధ్యయనం జరగాల్సిన అవసరాన్ని సూచించాయి. ప్రాక్-పురాయుగం నుండి ఆధునిక యుగం వరకు ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర-సంస్కృతిపై ఇంతవరకూ అంటే ప్రత్యేక రాష్ట్రం వచ్చి 47 ఏళ్ళు గడిచినా ఈ విషయమై జరిపిన కృషి పెద్దగా ఏమీ లేకపోవడం విచారించదగ్గ విషయం. కాలక్రమ రీతిలో, వివిధ చారిత్రికాంశాల సంబంధ సమన్వయంలో సమగ్ర చరిత్రను నేటి వరకు రూపొందించలేకపోయాం. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోని వివిధ యుగాల్లోని అనేకాంశాలపై విడివిడిగా అనేక విశ్వవిద్యాలయాల్లో గణనీయమైన కృషి మాత్రం జరిగింది. కాని ఈ పరిశోధనా ఫలితాలు అటు విశ్వవిద్యాలయాల్లో, ఇటు పురావస్తు శాఖలో ఉండిపోయాయి. అంతేకాక ఈ జరిగిన కృషిలో ఎక్కువ భాగం రాజకీయ, వంశావళి దృష్టి కోణం నుంచే సాగింది. ఈ కృషికి తోడుగా ఆర్థిక, సామాజిక, సాంస్కృతికాంశాలను జతపరచినపుడే మానవ వికాస క్రమాన్ని సమగ్రంగా ఆవిష్కరించటానికి వీలవుతుందన్న భావనతో ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ ఈ కృషికి నాంది పలికింది. వీరు తమ తమ విభాగాల్లో నిష్ణాతులైన వాళ్ళను ఎంపిక చేసి వాళ్ళ రచనలను ఒక సంపాదకుని సమన్వయంతో ప్రచురించింది. ఈ సంపుటిని సిద్ధం చేయడానికి అనుసరించిన పద్ధతి రెండు అంశాల మీద ఆధారపడింది. ఒకటి అధికారిక, పరిశీలనార్హ మౌలిక, అనుషంగిక ఆధారాలను సేకరించడం. రెండు ఇప్పటివరకు లభ్యమయ్యే సమాచారంతో ఈ ఆధారాలను శాస్త్రీయ తార్కిక పద్ధతుల్లో సమన్వయం చేసి విశ్లేషణాత్మకంగా వివరించటం. రాష్ట్రంలోనూ, దేశంలోనూ వున్న సుప్రసిద్ధ చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు, సాహితీపరులతో ఒక సలహా సంఘాన్ని ఏర్పాటు చేసి, వారి ఆధ్వర్యంలో ఈ కృషిని నిగ్గు తేల్చి సంపుటాలుగా వెలువరిస్తున్నారు.

"ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర-సంస్కృతి-1"
(ప్రాక్ పురాయుగం - క్రీ.పూ. 500 వరకు)
సంపాదకులు : ఎం.ఎల్.కె.మూర్తి, **అనువాదం :** ఆర్వియార్, **ప్రచురణ :** ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ మరియు ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. **వెల :** రు.120/-, **సోల్ డిస్ట్రిబ్యూటర్స్ :** విశాలాంధ్ర బుక్‌హౌస్.

అలా వెలువడిన "ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర-సంస్కృతి" అనే ఈ మొదటి సంపుటి ప్రాక్ పురాయుగం నుండి క్రీ.పూ. 500ల వరకు వున్న చరిత్రా సంస్కృతుల గురించి తెలియజేస్తుంది. ప్రాక్ చరిత్ర, చరిత్ర సంధి దశ సంస్కృతుల అధ్యయనం, ఆయా స్థలాల భౌగోళికత చూసినట్లయితే మరింత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుందని రెండవ అధ్యాయం తెలియజేస్తుంది. ప్రథమ, మధ్య, అంతిమ ప్రాచ్య శిలాయుగాలు - మధ్య శిలాయుగం ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇతర చోట్లా వేరుగా ఆహార సేకరణ సంస్కృతులను ప్రదర్శిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో దొరికిన ఈ యుగాల నాటి పనిముట్ల రకాలు, వాటి రూప సాంకేతిక గుణాలు సంస్కృతి సమన్వయ ప్రమాణాలు, ఆఫ్రికాలోనూ, యూరప్‌లోనూ లభ్యమైన సజీవ ఆవాసాలతో సంబంధం కలిగి ఉండటం విశేషం. దిగువ గోదావరి లోయలో నవీన శిలాయుగంలో మధ్య శిలా యుగం సంస్కృతి నిలిచి వుందనీ, తూర్పు భారతీయ నవీన శిలాయుగంలో సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయనీ తెలుస్తుంది. కర్నూలు గుహల్లో అంతిమ శిలాయుగపు, మధ్య శిలాయుగపు జీవజాతులు ఆహార అవశేషాల ద్వారా సూచితమవుతున్నవి. నవీన శిలాయుగం సంస్కృతులు ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా, రాయలసీమ వీరభూముల్లో విస్తరించుకొని వున్నా - గడచిన మధ్య శిలాయుగం నుంచి ఒక క్రమ పరిణామంగా నవీన శిలా యుగం ఆవిర్భవించినట్టు చెప్పుకునేందుకు తగిన సాక్ష్యాలు దొరకడం లేదు. ఆంధ్రలో ఇనుపయుగం బృహచ్ఛిలలతో విశిష్టమయింది. ఈ ఆచారం బయటి నుంచి చొచ్చుకు వచ్చినట్టే కనిపిస్తుంది. ఈ బృహచ్ఛిలా సమాధులు సముదాయంగా లేదా శ్మశాన వాటికలుగా కనిపిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇనుపయుగం ముందుకు చొచ్చుకు వచ్చి తొలి చారిత్రక దశతో కలుస్తుంది. బృహచ్ఛిలా యుగం తొలి చారిత్రక పట్టణావాసాలు క్రీ.పూ. మొదటి మిలీనియం ఉత్తర భాగంలో వచ్చి వుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తవ్వక స్థలాల్లో చాలా చోట్ల పట్టణ ఆవాసాలు క[illegible]పిస్తాయి. శిలా చిత్రలేఖనం ఆంధ్రప్రదేశ్‌లో ప్రాక్ చారిత్రక యుగం నుంచి చారిత్రక యుగ తొలి దశ దాకా ఒక ముఖ్య లక్షణంగా కనిపిస్తుంది. ఇలా ఆంధ్రప్రదేశ్‌లో ప్రాక్ చారిత్రక యుగం నుండి చారిత్రక యుగావిష్కరణ వరకు జరిగిన అనేక పరిణామాలు ఈ గ్రంథంలో వివరింపబడ్డాయి.

ఈ వ్యాసాలన్నీ క్లుప్తంగా, హఠాత్తుగా ముగిసినట్లే అనిపిస్తాయి. కొన్ని వ్యాసాలలో విషయం కంటే ఎక్కువగా పట్టికలు ఆక్రమించుకోవడం ఆశ్చర్యకరం. భాష విషయంలో మరింత శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరముంది. ఈ సంపుటిలో 11 అధ్యాయాలతో పాటు వాటిలో తగినన్ని పటాలు, పట్టికలు, బొమ్మలు కూడా విస్తారంగా చోటు చేసుకోవడం విశేషమే.

✻ కె.పి.అశోక్ కుమార్

శ్రీకారం



ప్రపంచీకరణ ప్రతిధ్వని
కవితలు, పాటల సంకలనం
సంపాదకుడు : డా॥ ఎస్వీ సత్యనారాయణ
వెల : రు.40/-, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు

సామ్రాజ్యవాద సాలెగూటిలో జనజీవితం
రచన : పి.రంగారావు
వెల : రు.40/-, ప్రచురణ : సి.పి.ఐ.(ఎం.ఎల్.) - న్యూడెమోక్రసీ, రాష్ట్ర కమిటీ ప్రతులకు : ప్రజాపంథా, మార్క్స్‌భవన్, విద్యానగర్, హైదరాబాద్, ప్రజాశక్తి బుక్‌హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్, సహచర బుక్ మార్క్, దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్; మైత్రీబుక్‌హౌస్, విజయవాడ; మణిబుక్‌స్టాల్, నెల్లూరు



మొగులు
రచన : అంబటి వెంకన్న
వెల : రు.40/-;
ప్రతులకు : అంబటి వెంకన్న కేరాఫ్ గురవయ్య, జడ్.పి. ఆఫీస్, నల్గొండ; నవోదయ బుక్‌హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్, సహచర బుక్‌హౌస్

గ్రామస్తులే చూశారు. వారి ఆచార వ్యవహారాల ప్రకారం పెళ్లికాని కుర్రవాడు అయినందున ఖననం చేయకూడదని నిర్ణయించారు.

అరటిబోదెలను తీసుకువచ్చారు. పక్కపక్కన తాళ్లతో కట్టి శవపేటిక మాదిరి తయారు చేశారు. దానిమీద శంకర్ మృతదేహాన్ని పడుకోబెట్టి నదిలో వదలిపెట్టారు.

తల దగ్గర చిన్న దీపం పెట్టారు.

నదీ ప్రవాహంలో శవం నెమ్మదిగా కదిలింది. ప్రవాహ ఉధృతికి ముందుకు సాగి క్రమక్రమంగా కనుమరుగైపోయింది.

కళ్లముందు నుంచి కన్న కొడుకు శవంగా మారి నదిలోంచి మాయమైపోయిన దృశ్యం దుర్గాబాయి మాతృ హృదయంలో చెరిగిపోని ముద్రవేసింది.

గ్రామంలో ఏ పనికోసమైనా నది దగ్గరకు వెళితే ఆమె కళ్లముందు శంకర్ మెదులుతాడు. 'అమ్మా అమ్మా' అని పిలిచే అతని మాటలు ఇంకా చెవుల్లో గింగుర్లెత్తుతూనే ఉంటాయి.

అందుకే హబ్రా గ్రామంలో ఆ నదిని చూస్తున్నప్పుడల్లా దుర్గాబాయి హృదయం వేదనతో బరువెక్కిపోతుంది.

* * *

"అమ్మా! నువ్వు అర్జెంటుగా మిద్నపూర్‌కు రా!" కూతురు



పాము కాటుకు గురి కాకముందు శంకర్

రత్నాబాయి ఇచ్చిన టెలిగ్రాం దుర్గాబాయిలో ఆందోళన నింపింది.

పెళ్లి అయి సుఖంగా సంసారం చేసుకుంటున్న రత్న నుంచి ఆ పదేళ్లలో వచ్చిన మొదటి టెలిగ్రాం అది.

వృద్ధాప్యం, ఒంటరితనం దుర్గాబాయిలో ఆందోళన కలిగించాయి. కూతురు సంసారం ఏమైందో, ఆరోగ్యం విషమించిందేమో తెలియక ఆమె ఎంతో తల్లడిల్లిపోయింది.

వెంటనే మిద్నపూర్ బయలుదేరింది.

అల్లుడు, కూతురు సాదరంగా ఆహ్వానించారు. "హమ్మయ్య! వారికి ఏమీ కాలేదు!" అని సంతృప్తిగా ఊపిరి పీల్చుకుంది దుర్గాబాయి.

అరగంటపాటు తల్లీకూతుళ్లు కష్టసుఖాలు మాట్లాడుకున్నారు. వేడివేడి పుల్కాలతో దుర్గాబాయి కడుపు నింపింది రత్న.

ఆ తర్వాత రత్నాబాయి చెప్పింది "అమ్మా! అన్నయ్య శంకర్ తలమీద పుట్టుమచ్చ ఉండేది కదూ?" అడిగింది.

"అవును, ఎందుకు?" ఆతృతగా అడిగింది దుర్గాబాయి. పదిహేనేళ్ల క్రితం పాముకాటుకు మృతి చెందిన కొడుకు ఆమె మనోఫలకం మీద మెదిలాడు. కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి.

"చెబుతాను" అంది రత్నాబాయి.



15 ఏళ్ళ క్రితం మృతి చెందాడని భావించిన కొడుకు శంకర్‌ను అక్కున చేర్చుకుంటున్న దుర్గాబాయి

పదిహేనేళ్ల క్రితం అరటిబోదెల మీద శవంగా కొట్టుకువస్తున్న శంకర్‌ను కొంతమంది గ్రామస్తులు చూసి ఒడ్డుకు లాక్కుని వచ్చారు. వైద్య పరీక్షలు జరిపారు. మూడు రోజుల తర్వాత అతనికి తెలివి వచ్చింది. కాటువేసిన పాము విషం వల్ల వెంటనే స్పృహ కోల్పోవడంతో చనిపోయాడని భావించారు.

నెలరోజుల తర్వాత శంకర్ కోలుకున్నాడు. అయితే కొద్దిరోజులు కోమాలోకి వెళ్లిపోవడంతో జరిగిన విషయాలను మరచిపోయాడు.

మిద్నపూర్‌లో తనను చేరదీసిన వారు కూడా దూరమైపోవడంతో రైల్వే కళాసీగా పనిలో కుదిరాడు. కొంతకాలంగా అదేపనిలో జీవనాన్ని గడుపుతున్నాడు.

రత్నాబాయికి 2003 మార్చి 20న మిద్నాపూర్‌లో శంకర్ అనుకోకుండా తారసపడ్డాడు. చెల్లి, తమ్ముని గుర్తించింది. తలమీద మచ్చను కూడా అంచనా వేసింది. అసలు విషయం అడిగి మొత్తం ఆరా తీసింది.

రత్నాబాయి చెపుతున్న విషయాలు అతనికి ఒక్కొక్కటిగా గుర్తుకు వచ్చాయి. శంకర్ మామూలు స్థితిలోకి వచ్చాడు. అమ్మను ఎప్పుడు చూస్తానా అని ఆశతో ఎదురు చూస్తున్నాడు.

"అమ్మను పిలిపిస్తాను లే" అంది రత్నాబాయి.

* * *

కూతురు చెప్పిన విషయం నమ్మలేకపోయింది దుర్గాబాయి. "ఏడీ నా శంకర్...ఎక్కడున్నాడు?" ప్రశ్నల వర్షం కురిపించింది.

"డ్యూటీ నుంచి వచ్చే టైము అయింది." అంది కూతురు రత్న.

ఇంతలో ఆరడుగుల ఎత్తులో బనియను, లుంగీతో ఓ వ్యక్తి ఆ ఇంటిలో ప్రవేశించాడు.

దుర్గాబాయిలో కన్నపేగు కదిలింది. మాతృ హృదయం తన రక్తాన్ని గుర్తించింది. "బాబూ" అంటూ అల్లుకుపోయింది.

శంకర్‌కు కూడా మాట రాలేదు. "అమ్మా" అనే కమ్మని పిలుపు హృదయాంతరాళం నుంచి తన్నుకుని బైటికి వచ్చింది.

వారిమధ్య మమకారం రాజ్యం ఏలింది.

మాతృత్వం వారధి కట్టింది.

పేగుబంధం ముడిపడింది.

తల్లీకొడుకుల కన్నీళ్ళతోనే ఆనందసాగరంలో ఓలలాడారు. ◆

తెరతీయగ రాదా...

✻ కొండబాబు

పాతికేళ్ళ క్రితం నాటి సంగతిది.

నమో వెంకటేశా... నమో తిరుమలేశా... టూరింగ్ టాకీసు మైకులోంచి పాట జనరంజకంగా వినబడుతోంది.

జనం ఆ పాటలోని భక్తి తత్వానికి పారవశ్యులవడం లేదుగానీ పాట మొదలవగానే హడావిడిగా నడవడం, కొందరు పరుగులు తీయటం ప్రారంభించారు. ఆ రేత్రికాడ ఆ డొంక రోడ్డులో జనం సందడి.

''మొదటాట వదిలేవారు...'' అందరికీ తెలిసిన విషయాన్నే సుబ్బరాయుడు ఆపుకోలేక చెప్పాడు.

''సర్లేవో... నడువ్ రెండో ఆటకు టికెట్లిత్తారు'' అన్నాడు వెంకటాద్రి గదమాయిస్తూ.

సినిమా హాలు చేరుకున్నారు. కిటికీల దగ్గర రెడ్ లైట్లు వెలుగుతున్నాయి. జనం తోసుకుంటూ టిక్కెట్లు తీసుకుంటున్నారు. తీసుకున్న వాళ్ళు హాల్లోకి పరుగు తీస్తున్నారు. తమ వాళ్ళ కోసం నేల మీద, బెంచీల్లో కండువాలు పరిచి సీట్లు రిజర్వ్ చేసేస్తున్నారు.

హాలు కిక్కిరిసింది. అందరూ ఉత్కంఠగా తెరవైపే చూస్తున్నారు. కానీ తెర కనబడటం లేదు. దానికి అడ్డుగా గుడ్డ తెర ఒకటి వేలాడుతోంది. ఏవో పాటలు వేస్తున్నారు. జనం పెద్దగా ఆలకించడం లేదు. తెర వైపే చూస్తున్నారు.

ఎవరో పెద్దగా అరిచారు.

''ఓ.. తెర తీస్తున్నారు'' అంటూ గుండెలుగ్గబట్టుకుని అందరూ తెర వైపు పరిశీలనగా చూశారు.

గుడ్డ తెర నెమ్మదిగా పైకి లేస్తోంది. వెండి తెర కొంచెం కొంచెం కనబడుతోంది.

* * *

ఈ సంఘటన చాలా మందికి పాతరోజులను గుర్తుకు తెస్తుంది. గుర్తు చేయడం ఉద్దేశం కాదు.. 'తెర వేలాడదీయడాన్ని' గుర్తుకు తేవడమే ఉద్దేశం.

సాధారణంగా పత్రికల్లో ఎక్కువగా వచ్చే

జాతీయాల్లో తెరదీయడం కూడా ఒకటి. వివాదాలకు 'తెరదీశారు...', ఘర్షణలకు 'తెరదించారు..'లాంటి వాడుకలు కనిపిస్తాయి. తెరదీయడం అంటే ఉపోద్ఘాతంలో పేర్కొన్న సంఘటనలో లాగా తెరను తీయడం కాదు. ప్రారంభించడం అనేది దాని లోతైన అర్థం. అలాగే తెరవేయడం, తెర దించడం కూడా ఆయా విషయాలకు సంబంధించి.. ముగింపుకు వాడతారు. ఈ రెంటిలో కూడా కర్తంటూ ఎవరో ఒకరు ఉంటారు. దానంతట అది జరిగేది కాదు. ఈ తెర తీయడం సినిమా తెరలనుంచి వచ్చినది కాదు.. అంతకు ముందు నాటకాల నుంచి వచ్చి ఉండాలి. పూర్వం నాటకాల్లో తెర అడ్డుగా ఉండేది. రంగాల మార్పిడికి తెరను ఆ విధంగా ఉపయోగించేవారు. బహుశా అప్పుడు మొదలై ఉండాలి. తర్వాత తోలుబొమ్మలాటకు కూడా తెరలుండేవి. ఇలా కళలతో తెరలుదీయడం జన బాహుళ్యంలోకి వ్యాప్తిలోకి వచ్చి ఉండొచ్చేమోకాని, మన పెళ్ళిళ్ళలో కూడా తెరలు ఏర్పాటు చేసే సంప్రదాయం ఉండేది. వధూవరులిద్దరూ జీలకర్రబెల్లం పెట్టుకునేంత వరకూ ఒకరినొకరు చూసుకోకుండా మధ్యలో తెర ఏర్పాటు చేసేవారు. జీలకర్రబెల్లం తంతు పూర్తయ్యాక తెరదీసే వారు. అప్పటి వరకూ వధూవరుల్లో పరస్పరం చూసుకోవాలన్న ఆసక్తీ, ఉత్కంఠ కొనసాగించడానికి పెట్టిన ఏర్పాటని చెబుతారు మరి. బహుశా తెరదీయడం ఇలా వివాహ సంస్కృతిలోంచి మొదలై కళా రూపకాలతో సామాన్య జన వ్యాప్తిలోకి వచ్చి ఉంటుంది.

ఏదేమైనా నేడు పత్రికల్లో ఈ జాతీయాన్ని ఎక్కువగా వాడుతుండటం గమనార్హం. అందుకే ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చింది.

ఈ అల్ప పదాల జాతీయం అనల్పార్థాన్నివ్వడం మాత్రం పదాలకు పదగలెత్తిన ఒక సంపన్న భాషకు నిదర్శనమే. ఇలా ప్రారంభానికి సూచకంగా ఉండే మరికొన్ని జాతీయాలు.. శ్రీకారం.., ఓనమాలు.., నాంది.., నాందీప్రస్తావన.., నడుంకట్టు.., కంకణం కట్టు.. లాంటివి. స్వల్ప తేడాలతో ఇవన్నీ దాదాపు ఒకే అర్థాన్నిచ్చే జాతీయాలు. వీటి గురించిన చర్చకు తెరదీద్దాం. తెరను తీయగరాదా...

◆

పాఠక స్పందన

మరో మంచి శీర్షిక పెట్టండి

పత్రిక అన్ని విధాలా బాగుంది. కానీ ఓ చిన్న సవరణ సూచిస్తున్నాను. ఆదివారం అనుబంధం కోసం అందరిలాగానే నేనూ ఎదురుచూస్తూ ఉంటాను. ఒక్కటి తప్ప అందులోని శీర్షికలన్నీ బావుంటున్నాయి. అదే 'ఇంటి సంగతులు'. అసలు ఆ శీర్షిక వల్ల ఎవరికి ఉపయోగమో ఆలోచించగలరు. దాని స్థానంలో స్త్రీలకు ఉపయోగపడే ఓ మంచి శీర్షికను ప్రవేశపెట్టండి. అవి – అప్పుడూ, ఇప్పుడూ స్త్రీల సమస్యలు, ప్రస్తుత సమాజంలో స్త్రీలు ఎలా నెగ్గుకురావాలి, స్త్రీల ఆరోగ్యం, వారు ఎలాంటి విద్యను అభ్యసించాలి? వారికి గల అవకాశాలేమిటి? ఆదర్శ స్త్రీ మూర్తుల పరిచయం, సమస్యలను వీరోచితంగా ఎదుర్కొని విజయం సాధించిన మహిళల కథలు (వారి మాటల్లోనే). మహిళల అభ్యున్నతి కోసం ఈ పేజీని ఉపయోగించగలరు.

–నవరసాల పశుపతినాథ్, పీలేరు, చిత్తూరుజిల్లా

అభివృద్ధి నిరోధక కథ

ఏప్రిల్ 13వ తేదీ సంచికలో ప్రచురించిన కథ చాలా అభివృద్ధి నిరోధకమైన భావజాలంతో ఉంది. రచయిత ఆ రకంగా కథను నడపడం ఏమీ బాగుండలేదు. దానిని మరో విధంగా రాస్తే బావుండేది. కథానాయికకు కొంతమేరకైనా ఆలోచనా శక్తి ఉండేలా, ఆమె వ్యక్తిత్వం అందులో ప్రతిబింబించేలా కథను నడిపి ఉంటే పాఠకులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. స్త్రీకి కేవలం భర్తే సర్వస్వం అన్నట్లుగా చెప్పడం ఏమీ బాగుండలేదు. అభివృద్ధి కరమైన కథలను ప్రచురించగలరు.

– మొలకలపల్లి కోటేశ్వరరావు, రావినూతల, ప్రకాశం జిల్లా

With best Compliments from

ANAND AGROS (P) LIMITED

Office : S.No. 12,13 & 14, Ground Floor,
Happy Trade Centre, Opp. Clock Tower, 62, S.D. Road, Secunderabad-3

Factory : S.No. 607 & 611, Kondamadugu Village,
Bibinagar - 508126, Nalgonda Dist., A.P.

Phone : Off 27713402, 27718817, Fax : 040-27718817,
Fact : 08685-268383

A. SURI BABU Managing Director

With best compliments from

విష్ణుప్రియా స్టోన్ క్రషర్

మైలారం గ్రా॥, బొమ్మలరామారం మం॥, నల్గొండ జిల్లా.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది